భూషణం వైరాగ్యం



"స్వామీ! స్వామీ! వింత చూశాను. వివరించి చెప్పాలి" అన్నాడు గోపకుమారుడు - దశాశ్వమేధ ఘట్టంలో జపం చేస్తున్న మణిసిద్ధుడి వద్దకు పరుగున వచ్చి.

మాట్లాడకపోతే సతాయింపు తప్పదని అనుభవంమీద తెలుసుకొన్న మణిసిద్ధుడు ధ్యానానికి ఉద్వాసన చెప్పి కళ్ళు తెరిచాడు. "వత్సా! గోపా! ప్రాణాంతకా! చెప్పు నీ సందేహం" అన్నాడు.

గోపన్న చెప్పాడు. "స్వామీ! ఇందాక అలా తిరుగుతూ, ఒక సత్రంలోకి వెళ్లాను. పాతికేళ్ళు పైబడని ఒక యువకుడి చుట్టూ చుట్టపక్కాలు చేరి పరిపరి విధాల బతిమాలుతున్నారు. అతగాడు, ఇవాళ, ఇక్కడ బంగాళాదుంప వదిలేస్తానన్నాడట. చివరికి బంగాళాదుంప కూర వేపడం మాత్రం వదిలి వేసేటట్లు ఒప్పిస్తున్నారు. ఈ ధర్మసూక్ష్మం ఏమిటి స్వామీ?"

మణిసిద్ధుడు మందహాసం చేశాడు. "గోపా! కలియుగ మానవులపై కూర ప్రభావం ఎంత ఉందో నీకు తెలియదు. అంత గొప్ప కూర కాబట్టే, దానితోచేసే రెండు రకాల వంట రెండు వేర్వేరు రకాలుగా పరిగణించి వర్జించమంటున్నారు" అన్నాడు.

"అంత మంచి కూరయితే, కందా, చేమ, కాకరకాయ ఉండగా ఈ కూరనే వదిలివేసేటంత విరక్తి ఎందుకు కలిగింది. స్వామీ! పైగా, ఇరవై రెండేళ్ళపడుచు, అతడి ఇల్లాలట - ఆమె కూడా ఆ కూరనే వదిలేస్తోంది. ఏమా కథ స్వామీ?" అన్నాడు గోపన్న కుతూహలంతో.

దివ్యమణి ప్రభావంవల్ల ఆ కథ యావత్తు కరతలామలకం చేసుకొన్నవాడై, సిద్ధుడు గోపకుమారుడికి ఇలా తెలియచెప్పాడు.

"ఓ గోపా! తుమ్మెద రెక్కలవంటి మీసాలుగల ఆ చిన్న వాడికి మొనమొన్ననే ఉద్యోగం అయింది. పేరు నాగభూషణరావు. వలచి వలపించుకొన్న కన్నెను వెంటనే

పెళ్లి చేసుకొని, బొమ్మరిల్లు వంటి చిన్న పెంకుటింట్లో కాపురం పెట్టాడు. ఆమె పేరు సుబ్బులు. ఒకప్రక్క వలపుతో తీయని కలలు కనడం, ఆ కలల గురించి మెలకువగా ఉన్నప్పుడు ఆలోచించుకోవటం, మరీ ఖాళీగా ఉన్నప్పుడు సినిమా పాటలు పాడుకోవడం, అవీ విసుగెత్తినపుడు పాఠాలు చదువుకోడం, మొదలైన పనులవల్ల, ఆ పడుచు పాకశాస్త్రం ఏమంత బాగా నేర్చుకోవడానికి వీలులేకపోయింది. ఫలానా కూరకి మెంతులు వెయ్యవచ్చునా కూడదా, ఎన్ని మిరపకాయలు వెయ్యాలి - ఇత్యాది విషయాలలో అనుమానం వేస్తే ఎక్కడిదక్కడ వదిలేసి, ప్రక్క వీధిలోనే ఉన్న పుట్టింటికి చెంగున పరుగెత్తికెళ్ళి కనుక్కు వచ్చేసేది. ఇలా వుండగా ఒకనాడు భూషణరావు ఆఫీసుకు వెళ్తూ సాయంత్రం సినిమాకి వెళదామని చెప్పాడు. సుబ్బులు అయిదు గంటలకల్లా నిప్పు రాజెయ్యడం మొదలుపెట్టి, ఐదున్నరకే కుంపటి రాజేసింది. బంగాళాదుంపలు అమ్మొచ్చాయి. బేరమాడి ఏబులం కొంది. వాటి వంక తేరిపార చూచి, అబ్బే చాలవనుకొని మరో ఏబులం కొంది.

వాటిని తరిగేటప్పుడు మాత్రం ఇద్దరికిన్నెందుకా అనుకొని ఏబులమే తరిగి ఉడకేసింది. వాటిని దింపి, బియ్యం పడేద్దామనుకొంటూ౯నే మరోసారి చూచింది. కూర చాలదే అని అంచనా వేస్తూ ఉడికిన ముక్కలు తొక్కులు వొలిచింది. చాలదని అప్పటికి నిర్ధారణ చేసుకొని, చకచకా మిగతా దుంపలు కూడా తరిగేసి ఉడకవేసింది. ఐదు నిముషాలలో భర్త వచ్చాడు. 'వంటయిందా! సినిమా కెళదాం' అంటూ, "అయిపోవచ్చింది. మీరు మొహం రుద్దుకుని పౌడరు వేసుకొని తయారవండి" అంది సుబ్బులు ధీమాగా. అతగాడు ముస్తాబై పోయి, 'జటకా పిలవనా' అంటూ వంటింట్లోకి వచ్చాడు. ఆలస్యం అవుతోందన్న ఆదుర్దాలో ఉడికీ ఉడకని బంగాళాదుంప ముక్కలను దింపేసి, వచ్చినంత వరకు తొక్కులు తీసి ఉడికిన ముక్కలను ఉడకని ముక్కలతో అదరాబాదరాగా గుచ్చెత్తిపోసేసింది.

ఆ బంగాళా దుంపల కూర చూడగానే భూషణం గుండె గుబేల్‌మంది. "ఏయ్, హేయ్, హోయ్ ఏమిటిది హేమిటిది" అనేశాడు హడావుడిగా. ఆ కేకలు విని పామో, తేలో కాబోలనుకొన్న సుబ్బులు తుళ్ళిపడింది.

"ఏమిటండీ? ఏమిటండీ?" అంది భర్తవంక చూస్తూ.

"ఏమిటది? ఏమిటది?" అన్నాడు భూషణం బంగాళాదుంపల కూరవంక చూస్తూ.

"కూర"

"ఇది సత్రమా? సంసారమా? ఇద్దరికోసం రెండు వీశెల దుంపలా?" అన్నాడు.

"రెండు ఏబులాలే! చాలదనుకుని వండాను."

"ఇద్దరికెంత కూరొండాలో తెలియని నువ్వెందుకు పనికొస్తావ్? తెలీకపోతే ఎవరినన్నా అడగరాదా? పుస్తకాలు కొని చదవరాదా? ఇలా చేస్తే ఎలా?" అని భూషణం గదమాయించాడు.

సుబ్బులు బిక్కమొగం వేసింది. భూషణం అంతటితో ఊరుకోక 'హుఁ' అని మరీ అడగటంతో తిక్క తిరిగింది. గబగబా పోపు వేయించి, కూరముక్కలు అందులో పడేసి గిరగిరా తిప్పి దింపి అక్కడ పెట్టి చెంగు బిగించి, అవతల వీధిలో పుట్టింటికి చరచరా వెళ్ళిపోయింది. ముస్తాబైన భూషణం మొహం

ముడుచుకున్నాడు. 'ఎక్కడికి? ఎందుకు వెళ్తావు బేలా? ఈ లీల' అని పల్కరించలేదు. దగ్గరకు తీసుకుని సముదాయించలేదు. సరాసరి ఒక స్నేహితుడింటికి బయల్దేరాడు. ఆయనగారు కూడా ప్రాణేశ్వరిమీద అలిగి, షికారు బయలుదేరాడు. ఇద్దరూ కలిసి సాయంత్రం ఏడున్నర వరకూ తిరిగారు. కరకర ఆకలి వెయ్యడంతో, భూషణం స్నేహితుడు ఇంటి ముఖం పట్టాడు. భూషణం కూడా ఏం పాలుపోక జంకుతూనే అత్తారింటికెళ్ళాడు.

అక్కడంతా పెందరాళే భోజనం చేసి ఆరుబయట వెన్నెట్లో పక్కవేసుకుని పడుకున్నారు. ముందర వాకిట్లో మొగాళ్ళు, వెనక పెరట్లో అత్తగారు, బామ్మగారు, మొదలైనవారు పడుకొని కబుర్లాడుకొంటున్నారు.

వెళ్ళగానే మావగారు పలకరించాడు. "ఏం భూషణం ఇవాళ ఐదింటికే భోజనం చేశావుట, అమ్మాయి చెబుతోంది" అన్నాడు.

భూషణం తెల్లబోయాడు. "సుబ్బులు అలా అని చెప్పింది కాబోలు" అనుకొని, ఆశ్చర్యపడి, తమాయించుకొని "మరేనండి. ముందర సినిమా కెళదామనుకున్నాం. తరువాత పనిమీద అలా వెళ్ళాల్సొచ్చింది" అన్నాడు.

మావగారు అటువేపు తిరిగి వాళ్ళ తోడల్లుడుతో మాట్లాడుతున్నారు. తను వచ్చినట్లు మరదలు పిల్ల ద్వారా పెరట్లోకి కబురు వెళ్ళిందప్పుడే. పావుగంట గడిచినా సుబ్బులు అంతఃపురోద్యానవనం దాటివచ్చే చాయలు కనబడలేదు భూషణానికి. వాలు కుర్చీలో పడుకొని నీలాకాశం వేపు చూశాడు. సుబ్బులు తేట మనసులో మొండి తిక్కలా ఆకాశంలో మబ్బు పింజ ఒకటి చలనం లేకుండా ఉంది. కదలదేం అనుకొన్నాడు. అతడికి ఆ సమయంలో మేఘ సందేశం జ్ఞాపకం వచ్చింది. రివ్వున గాలి వీచి మబ్బు కమ్మితే పెరట్లోంచి సుబ్బులు, వాకిట్లోంచి తనూకూడ చెంగున సావిట్లోకి దూకి తీరవలసిందే! ఓడినట్లవదు.

ప్రాధేయపూర్వకంగా చూశాడు. కాని మబ్బుపిల్ల మనసు కరగలేదు. అందుకని మరదలుపిల్లని పిలిచాడు.

"సరేలే! కాసిని మంచినీళ్ళు తెమ్మను" అన్నాడు.

"అక్కర్లేదులే" అన్న జవాబు, కాసిని మంచినీళ్ళు, పట్టుకొని మరదలుపిల్లే వచ్చింది. భూషణం కోపగించుకొని మళ్ళా షికారెళ్ళిపోయాడు. ఆకలి వేస్తున్నా, తిక్క మూలాన చిరుతిళ్ళు తినబుద్ధి కాలేదు. ఇంటికిచేరి తీసి ఉన్న తలుపు తోసి లోపలికి వెళ్ళాడు. సుబ్బులు నిద్రపోతోంది. భూషణం కూడా మాట్లాడకుండా పడుకున్నాడు. కాని ఆకలివల్ల నిద్రరాలేదు. అలవాటు ప్రకారం అతి నెమ్మదిగా లేచి వంటింట్లో కెళ్ళి గిన్నెలు తడిమాడు. అన్నం గిన్నం లేదు. బంగాళాదుంపల కూర మాత్రం ఉంది. అదే కాస్త తినబోయాడు. కాని కూర ఏమీ ఉడకలేదు. ఆకలి మూలాన, అదే బలవంతాన కాస్త తినేశాడు. మజ్జిగ గిన్నె చూస్తే ఖాళీగా ఉంది. మర్నాటికని తోడువేసిన పాలు కనపడ్డాయి. కళ్ళు మూసుకొని తాగేశాడు. చడీ చప్పుడు లేకుండా వచ్చి పడుకొన్నాడు. "జన్మలో ఇక బంగాళాదుంప కూర తినకూడదు" అని నిద్రపోయే ముందు ఒట్టు పెట్టుకున్నాడు. అంత విరక్తి కలిగింది ఆ కూర తిన్నాక.

తెల్లవారాక ఒకర్నొకరు ఎలా పలకరించుకోవాలో తోచక తిప్పలు పడుతున్న ఆ జంట పాలిట దేవతలల్లే భూషణరావు తల్లిదండ్రులు, అప్పచెల్లెళ్ళు బిలబిలమంటూ బండి దిగారు. "అనుకోకుండా కాశీయాత్ర ముహూర్తం పెట్టుకొన్నా బాబూ. నువ్వు, నీ పెళ్ళాం కూడా బయల్దేరండి" అని అజ్ఞాపించాడు భూషణం తండ్రి. ఆ తరువాత గలభాలో భూషణం, సుబ్బులు మాట్లాడుకొన్నారు కాని మనసు విప్పి కాదు. నువ్వు ఇందాక వెళ్ళేసరికి తర్జన భర్జన జరగడానికి కారణం అదే. పెళ్ళానికి బంగాళాదుంప కూర వండటం రాదని, అందువల్ల వదిలేయడం వుత్తమమనీ భూషణం గట్టిగా నిశ్చయించుకున్నాడు. ఆరోజు రాత్రి బలవంతాన ఆ ఉడికీ ఉడకని కూరతో కడుపు నింపుకొనడంవల్ల పూర్తిగా అదంటే వెలపరం, విరక్తి కలిగాయి. ప్రాణేశ్వరుడే వదిలేస్తూ వుంటే తనకు మాత్రం ఎందుకని ఆ పిల్ల కూడా ఆ కూరే వదిలేస్తోంది. ఉడకని కూర తినడమే మొగుడి విరక్తికి కారణమని ఆ ఇల్లాలికి తెలియదు. తెలిస్తే అసలు రహస్యం చెప్పివేసేదే. ఆ రహస్యం తెలియనందువల్లనే ఆ చిన్నవాడు కూడా తన భార్యకి అసలు బంగాళాదుంప వండటం చేతకాదని నిర్ధారణ చేసుకొన్నాడు. చుట్టాల రాకవల్ల కాశీయాత్రవల్ల ఈ రహస్యం మరుగునపడింది."

గోపన్న కథ వినగానే లేచి నుంచున్నాడు. "స్వామీ! వెంటనే ఈ రహస్యం నాకు తెలియజెప్పండి. నేను పరుగునపోయి ఆ ప్రమాదానికి అడ్డుపడతాను" అన్నాడు.

మణిసిద్ధుడు నవ్వి ఇలా అన్నాడు:

"ఆ రాత్రి తొమ్మిది గంటల వేళకి ఇల్లు చేరిన సుబ్బులు ఆకలికొద్దీ ఆ ఉడికీ ఉడకని బంగాళాదుంపల కూరలో ఉడికినదంతా తినేసి, మజ్జిగ తాగి పడుకొంది. గంటన్నర తరువాత అవురావురుమంటూ వచ్చి వుడకని కూరముక్కలు తిన్న భూషణం, ఈ రహస్యం తెలియక, భార్య వంట సౌలభ్యమే అంత అని అపోహపడి ఇప్పుడు ఆ కూర వర్జిస్తున్నాడు. అందువల్ల ఓ గోపా..."

గోపకుమారుడు చెంగున గంతువేసి స్నానాల రేవుకు రివ్వున పరుగుతీశాడు.

★ ★ ★

కౌటిల్య రమణీయం





ఈ కథలలో సెక్సప్పీలు
కమామిషు ఆటే లేదు
ఎదరంతా ఎడారి
అందువల్ల విసుగెత్తినపుడు
ఈ పేజీ చూసి –
ఆపైన కావాలంటే మీదగ్గరున్న
రొమాన్సు కథలు గాని
'డాష్ సెన్సారు –
సూత్రాల'ను గాని
చదివి, మళ్ళీ ఈ పుస్తకం
చదువుట
కొనసాగించ ప్రార్థన.